ప్రకృతి సాగుపై అవగాహన

బి.కొత్తకోట: రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయసాగు వైపు మళ్లేందుకు రైతులకు అవగాహన పెంచుకోవాలని బండారువారిపల్లె సర్పంచు ఉజ్జయిని సాంబశివ కోరారు. ఆదివారం పంచాయతీలోని శీతివారిపల్లె, కురవపల్లెలో ఏపీసీఎన్ఎఫ్ సంస్థ రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రైతులకు సేంద్రీయ సాగుతో కలిగే లాభాలను వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి సాగుతో కలిసి ప్రయోజనాలు, ఆదాయం గురించి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మండల, గ్రామస్థాయి ప్రతినిధులు రామకృష్ణ, ప్రవల్లిక, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

స్పాట్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మదనపల్లె సిటీ: పదవ తరగతి మూల్యాంకన కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వసతులు కల్పించాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.రెడ్డిశేఖర్‌రెడ్డి కడప ప్రాంతీయ విద్యా సంచాలకులు వెంకటకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌జెడీగా పదవీబాధ్యతలు చేపట్టిన వెంకటకృష్ణారెడ్డిని కడపలో మర్యాదపూర్వకంగా కలిశారు. వసతులు, వివిధ సమస్యలపై సానుకూలంగా స్పందించి డీఈఓకు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ధనుంజయరెడ్డి, రాజారెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బశ్వేశ్వర జయంతి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల అధ్వర్యంలో బశ్వేశ్వర జయంతి(గోమాత పుట్టినరోజు) ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీభ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించి నైవేద్య పలహారాలను గోమాతలకు సమర్పించారు. గోమాతలను పూజించి మొక్కులు తీర్చుకున్నారు.

రూ. 2.95 కోట్లతో రెడ్డెమ్మకొండ అభివృద్ధి

- రూ.1.20 కోట్ల నగదు నిల్వలు
- 1.282 కిలోల బంగారు, 27 కేజిల వెండి డిపాజిట్లు
- ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మ కొండ ఆలయాన్ని రూ.2.95 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక చైర్మన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.1.50 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. ఇందు కోసం రూ. 30 లక్షలు దేవాలయం తరపున డిపాజిట్లు చెల్లించామన్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రూ. 25 లక్షలతో అమ్మవారి కోనేరు అభివృద్ధి పనులు మంజూర య్యాయన్నారు. ఇందు కోసం రూ. 5లక్షలను దేవాలయం తరపున డిపాజిట్లు చెల్లించామన్నారు. కడప-బెంగళూరు జాతీయ రహదారిలోని దద్దాలవారిపల్లె నుంచి అమ్మవారి ఆలయం వరకు రూ. కోటి నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చెపడుతున్నట్లు చెప్పారు. వీటికి టెండర్లు కూడా పూర్తి అయ్యాయన్నారు. ఆలయ పరిసరాల్లో నూతనంగా రూ.20 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రెండేళ్ల క్రితం వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో అమ్మవారి ఖాతాలో రూ.10 లక్షలు నగదు నిల్వలు ఉండేవన్నారు. ప్రస్తుతం రూ. 57.25 లక్షలు నగదు నిల్వలు ఉన్నాయన్నారు. వీటితోపాటు ఫిక్సిడ్ డిపాజిట్లు రూపంలో మరో రూ.62.78 లక్షలు సదరు బ్యాంకులోనే ఉన్నాయన్నారు. 649 గ్రాముల బంగారు, బిస్కెట్ల రూపంలో మరో 643 గ్రాముల బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. 27 కేజీల వెండి కూడా బ్యాంకులో ఉందన్నారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సేవలు, ఈ-డొనేషన్స్, ఈ-హుండీ విధానం అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆలయ ఈఓ మంజుల, సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మదనపల్లె : అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం వైఎస్సార్ కడప అప్సర కల్యాణ మండపంలో జరిగింది. సమావేశానికి అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్రనేతలు గోపాల్‌రావు, చెంచురామయ్య, కిషోర్‌కుమార్, రాష్ట్ర గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ భవానీప్రియ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గాండ్ల, తెలికుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, రాజకీయ ప్రాధాన్యత, అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాలను ప్రకటించారు. అందులో.. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మదనపల్లె మండలం మిట్టపల్లెకు చెందిన బండపల్లి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్.కే.లక్ష్మీరమణ, కార్యదర్శిగా ఎం.వెంకటరమణ(కలకడ), కోశాధికారిగా నారుశ్రీధర్(రాయచోటి), ఉపాధ్యక్షులుగా మంచూరు జయరాం, బద్రివెంకటరమణ, బి.శంకర, ఎడమడకలజంగయ్య, బద్రిప్రసాద్, సంయుక్తకార్యదర్శులుగా కోటుపాటి వెంకటసుబ్బయ్య, టంగుటూరిచంద్రశేఖర్, పోతపోలువెంకటేష్, టి.శ్రీనివాసులు, గౌరవసలహాదారులుగా పెనగలూరిసురేష్‌బాబు, పొట్టెంప్రకాష్‌రావు, కొండయ్య, కార్యవర్గసభ్యులుగా 17మంది ఎన్నికయ్యారు.


గాండ్ల,తెలికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ: స్థానిక చంద్రాకాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 298 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 216 మంది పరీక్ష రాశారు. పరీక్షలను ఎంఈఓ ప్రభాకరెడ్డి తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ కన్యకుమారి, అబ్జర్వర్ సుజాత పర్యవేక్షించారు.



విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి

మదనపల్లె : బలిజసేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో సోమవారం ఉదయం జరగనున్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఆవిష్కరణకు పెద్దసంఖ్యలో బలిజ కులస్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు బీపీఎల్.విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానిక బలిజసేవా సమితి కార్యాలయంలో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లు, ఆహ్వానానికి సంబంధించి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీపీఎల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ...పాతికేళ్లుగా శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుపై అలుపెరగకుండా ప్రయత్నిస్తూనే వచ్చామన్నారు. ప్రస్తుతానికి విగ్రహ ఏర్పాటు కల సాకారం కావడం, ఆవిష్కరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, బలిజసేవాసమితి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు విజయలక్ష్మిభాస్కర్, తోటమదనేశ్వర్, భానుప్రకాష్, మోహన, సూర్యనారాయణ, రాజ్‌భవన్‌రాజా, తంగాలశ్రీనివాసులు, సాక్కంవేణుగోపాల్, జంగాలశివరాం, పగడాలసూరి, శ్రీనివాసులు, రామాంజులు, శశికాంత్, శ్రీనివాసులు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.







